


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### పెద్దవాళ్ళు

**అప్పుడు నాకు** పద్దెనిమిదేళ్ళు! అందులో ఆశ్చర్యార్ధకం పెట్టాల్సిందేం వుందీ? అందరు ఆడపిల్లలకీ పద్దెనిమిదేళ్ళు వస్తాయి, తర్వాత పంతొమ్మిదొస్తుంది. కానీ నేను ఆశ్చర్యపడే పనులే చేసేదాన్ని.

ఓ కుర్రవాడు "నన్ను పెళ్ళిచేసుకుంటావా?" అని అడగగానే, కన్ను రెప్పకొట్టే సమయంలో "సరే" అనడమే కాకుండా, ఆ నిమిషం నుండీ మాట మీద నిలబడి, ఆ పని చెయ్యడానికి పెద్దల వ్యతిరేకతా, సూటిపోటీ మాటలూ. ఇంకా సమాజం సాధింపూ అన్నీ పడ్డాను.

ఈ పార్శ్వం మీకు నేనెప్పుడూ చెప్పలేదు. సమాజం అంటే ఎవరో అంత చిన్నప్పుడే నాకు తెలిసొచ్చింది. సమాజం అంటే ఒకటో నెంబరు ఇంటావిడ. ఆవిడకి మూడో నెంబరు ఇల్లు కూడా వుండేది. మూడో నెంబరు ఇంట్లో స్వంత భర్త ఉండేవాడు. ఒకటో నెంబరు ఇంటాయన భార్య పోయాక, ఆయనకి ఒక వయసొచ్చిన కూతురు ఉన్నప్పటికీ ఈవిడ ఆయనకి రెండో భార్య స్థానంలో ఆ ఇంట అడుగు పెట్టి, ఒకటో నెంబర్ ఇంటావిడ అయింది. అలా అని మూడో నెంబరు ఇంటాయన్ని వదిలి పెట్టలేదు. రెండో నెంబర్ ఇంట్లోకి ఎవరు దిగినా నరకం చూపెట్టింది. ఇంతకీ ఎవరికీ స్వంత ఇళ్ళుకావు కార్పోరేషన్ వారి క్వార్టర్స్.

'క్వార్టర్‌లో' వుంటూ కూడా, ఒక 'ఫుల్' కొట్టి దారిపోయే ఆడవాళ్ళంతా పతివ్రతలు కారనీ, తను ఒకటో నెంబర్ ఇంటిలో వున్నప్పుడు మూడో నెంబర్ ఇంటాయన్నీ, మూడో నెంబర్ ఇంట్లో వున్నప్పుడు ఒకటో నెంబర్ ఆయన్నీ కన్నెత్తి చూడనని ఉపన్యాసాలిచ్చేది.

ద్రౌపది కూడా పాతివ్రత్యానికి అప్పట్లో అలాంటి డెఫినెషన్స్ ఇచ్చి వుండదు. ఆవిడ కారణ జన్మురాలు. ఈవిడ అకారణ జన్మురాలు. అలాంటి ఫస్ట్ నెంబర్ నేను ప్రభాకర్ అనే కుర్రవాడ్ని చేసుకోవడం పట్ల తన విముఖత బాహాటంగా, లౌడ్ స్పీకర్‌లాంటి నోటితో కాలనీలో ప్రకటించింది. అప్పటినుండీ మా మీద వార్ సాగించింది. మా ఇంట్లో అమ్మ మీదా, నా మీదా. అప్పుడు నేను అడిగాను మా అత్తగారికి లేని బాధ ఈవిడకెందుకు అని? దానికి అమ్మ " 'సమాజం' అంతే అమ్మా! " అంది.

అప్పుడు 'సమాజం' ఎలా వుంటుందో నాకు మొదటిసారిగా అర్ధమైంది. అస్సలు బావుండేదికాదు.

మా అత్తగారు కూడా మా పెళ్ళికి వ్యతిరేకమే. ఆవిడ కళ్ళబడకుండా అమ్మ ఆఫీస్‌కి వెళ్ళొచ్చేది. ఆవిడ అభియోగాలు తెల్లగా అందంగా వుండే ప్రయోజకుడైన యువకుడ్ని నేను బుట్టలో వేసుకున్నాను అని. 'అంత పెద్ద బుట్ట మా ఇంట్లో లేదుగా' అనుకునేదాన్ని.

రోజూ ఈ 1985 లవ్‌స్టోరీ మాత్రం నడుస్తూనే వుండేది. ఆయన ప్రతి సాయంత్రం మా ఇంటికి రావడం, నా చేతి కాఫీ తాగడం, మిగతా అన్నయ్య ఫ్రెండ్స్ వచ్చి కూర్చుని కావాలని మమ్మల్ని డిస్టర్బ్ చెయ్యడం. ఇలా సరదాగా గడిచిపోతుండగా, రెండు రోజులు ఈ తెల్లకుర్రవాడు మా ఇంటికి రాలేదు. 'నేను చెక్కిలి మీద చెయ్యివేసి చిన్నబోయుంటే' నానీ అనే ఈయన ఫ్రెండ్ వచ్చి "ప్రభాకర్‌కి జ్వరం... అందుకే రాలేనని చెప్పమన్నాడు" అన్నాడు.

అసలు కేరెక్టరైజేషన్ అనేది చిన్నప్పటినుండే తెలుస్తుందండీ. అందుకేగా మా సినిమాల్లో చిన్నతనంలో 'నేను కింద పడ్డ పైసలు ఏరుకోను' అనిపించి పెద్దయి అమితాబ్ బచ్చన్‌కి అదే కేరెక్టరైజేషన్ పెట్టారు.

అలాగే చిన్నప్పటినుండీ నాకు 'భయం' అంటే తెలీదు.



సో.. కాబోయే శ్రీవారికి జ్వరం అనగానే లేచి లంగా ఓణీ మార్చుకుని, జడ సవరించుకుని, చెప్పులు వేసుకుని బయల్దేరాను. "ఎక్కడికే?" అన్న అమ్మా, అమ్మమ్మకి "ప్రభాకర్ వాళ్ళింటికి" అని బదులిచ్చాను.

వాళ్ళిద్దరూ షాక్! "అవతల వాళ్ళమ్మగారు మనం కనపడితే తిడ్తుంటే, తగుదునమ్మా అని నువ్వెళ్ళి పరామర్శ చేస్తావా?.. ఒద్దు" అన్నారు.

వింటే మనం ఎందుకౌతాం?

నేను వాళ్ళ వాకిలి గేట్ తోసుకుని లోపలికి వెళ్ళేసరికి, బియ్యం చెరుగుతున్న మా కాబోయే అత్తగారు నోరు తెరిచి, అలా దెయ్యాన్ని చూస్తున్న ఆవిడలా వుండిపోయారు. నేను చనువుగా వెళ్ళి మా కాబోయే శ్రీవారి దగ్గరగా నేనే ఓ కుర్చీ లాక్కుని కూర్చున్నాను.

అత్తగారు వంటగదిలోకి వెళ్ళి ధనాధనా గిన్నెల శబ్దం చేసారు. "అబ్బే! కాఫీలు లాంటివేం వద్దులెండి" అందాం అనుకున్నాను. కానీ ప్రభాకర్‌కి వంద వున్న జ్వరం నన్ను వాళ్ళింట్లో చూడగానే నూట మూడు అయి కూర్చున్నట్లుంది ఎర్రగా అయిపోయి "ఎందుకొచ్చావు? అమ్మకి ఇష్టం వుండదు. వెళ్ళిపో" అన్నారు.

ఇక్కడ స్క్రీన్‌ప్లే మీకు చెప్పి తీరాలి. ఆవిడ వంట గదిలో నుండి "దొంగపిల్లి.. మా ఇంటిమీదే చూపంతా... అందరిళ్ళలోనూ పాలు వుంటాయి. మా ఇంట్లోనే ఎందుకు దూరుతుందో..!?" అని తిడ్తున్నారు.

నేను నవ్వుకుని మా ఆయనకి ధైర్యం చెప్పా. ఆయన గొంతు ఎండిపోయి గుటకలు మిగారు.

నేను లేచి వెళ్తూ "అత్తయ్యగారూ వెళ్ళొస్తా" అన్నాను.



ఆవిడ గబగబా వచ్చి రెండు జామపండ్లు నా చేతిలో పెట్టి, మొహాన బొట్టుపెట్టి, "వెళ్ళు.. మళ్ళీ ఇలా రాకు" అన్నారు.

నేను వెనక్కి తిరిగి "మళ్ళీ ఇలా రాను. కోడలిగా వస్తాను" అన్నాను.

ఆఖరి పంచ్ మనదైతే ఆ కిక్కే వేరబ్బా.

ఆవిడ ఆ తర్వాత కూడా "అమ్మో అమ్మో ఆ పిల్లకి ఎంత ధైర్యం? ఎలా వచ్చేసింది?" అని గుండెలు బాదుకున్నారట.

తరువాత రిజిస్టర్ మేరేజ్ చేసుకున్నాం. మనవడు కడుపున పడగానే, ఆవిడ అన్ని మెట్లు దిగి మా ఇంటికొచ్చింది. ఇద్దరం స్నేహంగా సిటీ సెంట్రల్ లైబ్రేరీలో కార్డులు పంచుకుని పుస్తకాలు తెచ్చుకుని చదువుకుంటూ కలిసి మెలిసి వున్నాం. పోయేదాకా నా దగ్గరే ఉన్నారు.

ఆనాడు ఆవిడ నా చేతికిచ్చిన రెండు పండ్లు కూడా పెరిగి పెద్దయి ప్రయోజకులు అయ్యారు.

ఇప్పుడు మా పెద్ద పండుని "పెళ్ళి చేసుకోరా. లేట్ అవుతోంది" అంటే

"తొందరేం?" అంటాడు.

వాళ్ళ నాన్న మొన్న "సమాజంలో తల ఎత్తుకు తిరగలేకపోతున్నాను" అంటే మా వాడు "నువ్వెప్పుడు చేరావు?" అన్నాడు. ఆర్యసమాజ్‌లాంటిది అనుకుని.

ఆయనకి చిరెత్తుకొచ్చి "ఊరికే బుర్ర అంతా దులిపి తెల్లకాగితం మీద ఒలకబొయ్యడం కాదు. వాడికి కాస్త జనరల్ నాలెడ్జ్ నేర్పించు" అన్నారు.

నేను వాడికి సమాజం అనగానేమి? అన్న ప్రశ్నకి ఏస్సే ఆన్సర్ చెప్పి వివరించాలని చూశాను.



వాడు "ఏది సమాజం? మొన్న ఇస్త్రీ బట్టలకి వచ్చినప్పుడు వరలక్ష్మి అడిగిందా? తనా సమాజం? నాన్న ఆఫీస్‌లో నరసిమ్మా? ఎదురింటి ఆంటీనా? గుడిలో పూజారిగారా? మొన్నెప్పుడో ఎవరిదో పెళ్ళిలో ఒక ఆంటీ ఒళ్ళంతా నగలేసుకుని మీ అబ్బాయికి పెళ్ళెప్పుడు చేస్తారు?" అంది ఆవిడా సమాజం? లేకపోతే నీ ఎఫ్. బి ఫ్రెండ్సా?" అంటూ పడి పడి నవ్వడమే కాకుండా, వాళ్ళ తమ్ముడికి ఫోన్ చేసి "నాకు పెళ్ళి కాలేదని సమాజం అడుగుతోందట్రా" అంటే వాడూ పడి పడి నవ్వాడు.

"మనకి ఏదైనా కష్టం వస్తే ఈ సమాజం వస్తుందా? నీకు కొత్త 2,000 నోటుకి ఈ సమాజం చిల్లర ఇస్తుందా?" అని మళ్ళీ నవ్వాడు.

మేం మా పెద్దాళ్ళని ఎదిరించి పెళ్ళిచేసుకున్నాం. వీళ్ళూ మమ్మల్ని ఎదిరించి పెళ్ళిచేసుకోవాలి కానీ ఇలా పెళ్ళి చేసుకోకుండా సాధిస్తే ఎలా?

సాయంత్రం పోస్టల్ ఏజంట్ భారతొచ్చి మొగుడి గురించి కష్టాలు చెప్పుకుని, "ఈ సమాజంలో తలెత్తుకుని తిరగలేకుండా వున్నాను" అనగానే, నేనూ పడి పడి నవ్వాను.

"మొగుడి చేత రోజూ తన్నులు తింటేనే నువ్వు, ప్రశాంతంగా నిదురపోయే సమాజం నీకు అవసరమా? కాలితో తన్ను ఆ సమాజాన్ని" అని సలహా ఇచ్చాను.

అసలు పెద్దవాళ్ళ గురించి చెప్తాం మీకు అని మొదలుపెట్టి, సమాజం గురించి చెప్తున్నాను.

మా ఫ్రెండ్ లక్ష్మీగారు పెట్టిన హోమ్ ఫర్ ది ఏజ్డ్‌లో పధ్నాలుగుమంది 'అమ్మలు'న్నారు. అందులో అందరూ కడుపు నిండా బిడ్డల్ని కన్నవాళ్ళే. ఓ తల్లికి పన్నెండుగురు సంతానం. అయినా అందరి పిల్లలూ వీళ్ళని ఆశ్రమానికి పంపించి వదిలించుకున్నారు. మరి వీళ్ళని సమాజం ఏమీ అనదేం? అమ్మకి అన్నం పెట్టడం నీ కర్తవ్యం అని ఏ పిల్ల తోటీ, పిల్లాడి తోటీ చెప్పదేం?

మొన్న ఎవడ్నో మా కాలనీ వెనుక బస్తీలో ఓ గూండా బాగా చితక తంతున్నాడు. దెబ్బలు తింటున్న అతను ఏడుస్తూ అతని కాళ్ళు పట్టుకుంటున్నాడు. మన 'సమాజం' వలయంగా చుట్టూ నిలబడి తమాషా చూస్తోంది. కాసేపయితే అక్కడో పిడత కింద పప్పు అమ్మేవాడూ, ఐస్ ఫ్రూట్ అమ్మేవాడూ వినోదంగా ఇది చూస్తున్న వాళ్ళకి అమ్మడం మొదలు పెట్టినా ఆశ్చర్యం లేదు.

ఏ.టి.ఎమ్ దగ్గర ప్రొద్దుట నాలుగింటికే వెళ్ళి జనం క్యూ కట్టినప్పుడు ఓ బలవంతుడు తోసుకుని ముందుకెళ్ళిపోతాడు. రిటైర్డ్ గవర్నమెంట్ సర్వెంట్ "ద వరల్డ్ ఈజ్ గోయింగ్ టు డాగ్స్" అంటాడు. మిగతా వాళ్ళు చెవిలో వేలెట్టి తిప్పుకుంటూ చిరాగ్గా చూస్తారు. వాళ్ళు 'సమాజం'?

సరే సమాజం సంగతి పక్కన పెడితే ఇంట్లో పెద్దవాళ్ళు వుంటే ఎంత బావుంటుంది అండీ? మా ఆశ్రమంలో 'అమ్మ'ల్ని నెలకోసారి నేను నాతో హోటల్‌కీ, సినిమాకీ తీసుకెళ్తా. చిన్న పిల్లలు బయటకి తీసుకెళ్తే సంబరపడినట్టు వాళ్ళు సంబరపడ్తారు.

మా అత్తగారు వున్నంతకాలం ఇంటి ముందు చాటల్లో ఏవో ఒకటి ఎండుతూ వుండేవి. అవి కొబ్బరి చిప్పలో, ఎండు మిరపకాయలో, కుంకుడు కాయలో, మావిడ ఒరుగులో ఏవో ఒకటి. దీపావళినాడు బాణాసంచా ఎండపెట్టినట్లు ఆవిడ అక్కడే నవారు మంచం వేసుకుని 'దేవీభాగవతం' చదువుతూ, కాకుల్నీ, పిల్లుల్నీ దగ్గరకి రానివ్వకుండా తోలుతుండేవారు.

మొన్న రెండు నెలలు నాకు ఒంట్లో బాలేక అమ్మ నాదగ్గర వుంది. మధ్యాహ్నాలు బద్ధకించకుండా 'కొయ్యరొట్టె' కాల్చడం, ఉసిరికాయలో, చింతకాయలో, నిమ్మకాయలో కొని ఏవో ఒక ఊరగాయలు పెట్టడం, రవ్వలు విసరడం, కందిపొడీ, కారం పొడీ కొట్టడం, అసలు పెద్దవాళ్ళకి రోజూ మొత్తం ఏదో ఒక పని వుంటుంది.

చిన్నపిల్లలకి 'శ్రీరాముని దయచేతను' అని పద్యాలు నేర్పిస్తారు. రాత్రుళ్ళు 'ఒకరాజూ ఏడుగురు కొడుకులూ" అని కథలు చెప్తారు.

అస్సలు బద్ధకించరు. పోపు సామాన్లు పోసుకునే ప్లాస్టిక్ డబ్బాలూ, సీసాలూ, కడిగి ఆరపెట్టడం, బొంతలు కుట్టడం, పక్క బట్టల మధ్య కలరా వుండలు వెయ్యడం, పెరుగు చిలికి వెన్న తియ్యడం, పురాణాలు పైకి చదవడం ఇవన్నీ పెద్దవాళ్ళే చేస్తారు. తాతగార్లు అంతా సాయంత్రాలు మా కాలనీలో పార్కులో కూర్చుంటే 'ఒకప్పుడు ఉరుకులూ పరుగులతో జీవితాలు గడిపిన వీళ్ళంతా ఇప్పుడీ ప్రశాంతతని ఆనందిస్తున్నారా? లేదా? ఎవరూ పట్టించుకోడం లేదని బాధపడ్తున్నారా? అనిపిస్తుంది.

ఈ అమ్మల్నీ నాన్నల్నీ పట్టించుకోని పిల్లల్నీ, పెళ్ళాల్ని రోజూ తన్నే మొగుళ్ళనీ సమాజం ఏం పట్టించుకోవడంలేదు మరి. 'సమాజానికి' టైం లేనట్టుంది పాపం. కానీ ఎవరైనా భయపడ్తుంటే, వెంటపడే పిచ్చి కుక్కలా ఈ సమాజం తరిమి తరిమి భయపెడ్తుంది.

పెద్దవాళ్ళంటే గుర్తొచ్చింది. వీళ్ళకి అందరూ తమవాళ్ళే అన్న ఫీలింగ్ వచ్చేస్తుందేమో. మా వాడి ఫ్రెండ్ తాత, వాళ్ళు వెళ్ళి "భరత్" అని పిలవగానే "ఆ పిచ్చి వెధవలొచ్చారు. చూడు అంటాడట."

ఓసారి వాళ్ళు కార్లో ఎక్కడికో వెళ్తుంటే కిరణ్ అనే ఫ్రెండ్ దార్లో కనిపిస్తే భరత్ ఎక్కించుకున్నాడట. ఆయన తమిళంలో ఏదో అడిగాడుట. "ఏం అడిగాడ్రా మీ తాత?" అంటే "వీడు ఎవరూ? అన్నాడు" అని భరత్ చెప్పాడుట. ఆయన వెంటనే "ఈ పిచ్చిముండా కొడుకెవరు? అన్నాను" అని తెలుగులో చెప్పాడుట.

మా అత్తగారు, పిల్లలు ఫ్రెండ్స్ ఆడుకోడానికి పిలవడానికొస్తే, "పోకిరీ వెధవలతో ఆడబోకండి. రానని చెప్పండి" అనేవారు.

మా అన్నయ్య చిన్నకొడుకు చిన్నప్పుడు, ఓ ఫ్రెండ్‌ని ఇంటికి తీసుకొచ్చి వాడికి టిఫిన్ పెట్టమనేవాడు. వాడు తింటూంటే "వీడికి మేత్స్‌లో జీరో. అన్నింట్లో ఫెయిల్" అనేవాడు.

పెద్దవాళ్ళు ఎంత రాత్రయినా పడుకోరు. వంటింట్లో వాళ్ళ కళ్ళు కప్పి, మంచినీళ్ళు కూడా తాగలేము. "ఎవరది?" అని లేస్తారు.

రాత్రంతా ఎప్పుడు తెల్లవారుతుందా? అని పక్కలో గడియారం పెట్టుకుని పడుకునే వాళ్ళు నాకు తెలుసు. చాదస్తంగా చెప్పిందే చెప్పినా, "అన్నం తిన్నావా? పెందరాళే పడుకో. ఇంటికి ఎప్పుడొస్తావ్?" అని అడగడానికి ఇంట్లో పెద్దవాళ్ళు వుండాలి.

పెద్దవాళ్ళు లేని ఇళ్ళు, దేవుళ్ళు లేని గుళ్ళు.

(వచ్చేసంచికలో కలుద్దాం)

Post your comments